# నెంబర్రాళ్లు

ఎగిరి ఒక్క తన్ను తన్నాడు!

తన్నింది మనిషి ఆకారమని తెలుస్తూనే ఉంది. ఆ ఆకారానికి నాకు మధ్య చెప్పుకోదగినంత దూరం కూడా లేదు. అయితే తన్నులు తిన్నది మాత్రం ఎవరో కనిపించలేదు మా మధ్య నింగి నుండి నేలకు దిగిన చీకటి తెరలు కారణంగా!- అలా తన్నులు తిన్న వ్యక్తి లేచి తిరగబడలేదు. తప్పించుకొని పారిపోవడానికి ప్రయత్నించలేదు. అందుకే అంత రాత్రిలో అంత గప్‌చిప్‌గా అలా తన్నులు తిన్నది ఎవరో తెలుసుకోవాలన్న ఉబలాటం! కన్నులు చించుకున్నా ప్రయోజనం లేకపోయింది. అయితే ఆ తెల్లని ఆకారం చేసిన చేష్ట మాత్రం నల్లని చీకటి తెరమీద తోలుబొమ్మలాటలా స్పష్టంగా కనిపించింది!

మనిషి కోపంవస్తే చేతికి కాలికి భేదం తెలియదు.

చేత్తో కొట్టకుండా కాలితో తన్నడమంటే ఆ కసిని సులభంగా ఊహించుకోవచ్చు. అప్పటికీ కసి తీరలేదేమో?. కాలితో తన్ని బయలుదేరిన ఆకారం మళ్లీ గిరక్కున వెనక్కు తిరిగి మూతిని మాత్రం ముందుకు వంచి కారి తుపుక్కున ఉమ్మింది!

కోపం వస్తే మనిషి పశువైపోతాడు. మంచీ చెడ్డా మరిచిపోతాడు. కోపం రాకూడదు అంటారు కానీ వస్తే తట్టుకోవడం కూడా అంత సులభం కాదు. అలా తట్టుకోలేనప్పుడు మనిషి మనిషిని తన్నడం సహజం. తన్నడానికో కొట్టడానికో సంస్కారం అడ్డుపడ్తే కారి ఉమ్మడమూ సహజమే!-

కనుచూపు మేరలో కంటబడిన దృశ్యం - అతి క్లిష్టంగా అర్థం కాకుండా నన్ను ఆలోచింపచేస్తూ ఉంది. ఆలోచనతో పోటీపడుతూ ఆశ్చర్యం. ఈ రెండూ ముడిపడి ఎంత ప్రయత్నించినా ముడి వీడకుండా బిగుసుకొంటూ ఉంది.

ఉన్నట్లుండి నాచూపు ఆ ఆకారం వైపు మళ్లింది!

జోరీగలు చుట్టుముట్టి కరుస్తూ ఉంటే తప్పించుకొని పారిపోయే గొడ్డులా పడ్తూ లేస్తూ

ఆ గనిమల మీద నడక పరుగ్గా - ఆ ఆకారం!

ఎవరిదీ ఆకారం?... అంత రాత్రిపూట ఆ ఆకారం చేస్తున్న చేష్టలేమి?- తెలుసుకోవాలన్న ప్రబలమైన కోరిక!

దెయ్యాలు భూతాలమీద నాకు నమ్మకం లేదు.

అందుకే ఆ ఆకారం వెంటపడ్డాను!

ఆ సమయంలో ఈ దృశ్యం ఎవడి కంట అయినా పడ్తే- ఏదో దొంగతనం చేసి తప్పించుకొని పారిపోతున్నవాడిని పట్టుకొనే ప్రయత్నమని తప్పక అనుకొంటాడు.

చాకలి బట్టల్ని ఉతికి ఒక కోక ప్రక్కన పంచెను... పంచె ప్రక్కన చవకాన్ని ...చవకం ప్రక్కన దుప్పటిని ఆరేసినట్లు ఆ కయ్యలను వేరుచేస్తూ గనిమలు. ఓహో! అంటే ఒక వట్టికాలు లావుతో! మంచులో తడిశాయి. ఆ గనిమల మీద ఒకరి వెంట ఒకరుగా మేము!-

తడిసిన గనిమల మీద ఆ ఆకారం పరుగు. కాళ్లు తడబడుతున్నాయి. తడబడిన కాళ్లు జారుతున్నాయి. కాలుజారే సరికి బోర్లబొక్కల పడినట్లు పడి ముంజేతుల మోపు మీద నిలదొక్కుకొంటున్నాడు. మళ్లీ లేస్తున్నాడు. అటూ ఇటూ చూడకుండా ముందుకు దూసుక పోతున్నాడు!- అలవాటు తప్పిందికదా? ఆ గనిమల మీద నా పరిస్థితి అంతకంటే అధ్వాన్నంగా ఉంది. అయినా వెంట పడ్డాను.

ఆ ఆకారం ఉన్నట్లుండి ఒక బావి గట్టున నిలబడింది. ఎడమకాలి చెప్పను కుడిచేతికి తీసుకొనింది. నాలుగు దిక్కులు కలయ చూస్తూ ఉంది. ఆ చూపుల నుండి తప్పించుకోవాలనే నా ప్రయత్నానికి మొలలెత్తు పెరిగిన జొన్నచేను సహకరించింది. ఆ చేని చాటులో నిలబడి రెప్పార్చకుండా చూస్తున్నాను.

ఎడమకాలి చెప్పు కుడిచేతిలో ఉందికదా? ఎంచినట్లు ఏడేట్లు కొట్టాడు!

నా ఆశ్చర్యం ఆకాశంలో చుక్కల్ని తాకితే అవి మిలమిలా మెరుస్తున్నాయి. ఆశ్చర్యంతో పోటీ పడుతూ ఆలోచన!-

బలవంతుడనుకొంటే బలహీనుణ్ణి దయా దాక్షిణ్యాలు లేకుండా కొట్టగలడు చెప్పుతో కొండిలో విషాన్ని నింపుకున్న తేలు కంటబడితే చెప్పు క్షణంలో చేతికొస్తుంది! అలా ఆలోచిస్తూ ఉంటే ఉన్నట్లుండి నా మనసు పట్టణంలో మా ఎదురింటిమీద వాలింది. ఒక్కటంటే ఒక్క క్షణం!

ఒకరోజు ఆ ఇంటి ఇల్లాలు ఏడుస్తూ ఉంది. ఆ ఏడుపు గుండెల్ని చీలుస్తూ ఉంది. ఇక్కన ప్రక్కన ఉన్నవాళ్లు కూడా మనుషులే కదా?- గుంపు చేరారు. ఆమె భర్త చేస్తున్న పనికి అందరూ నివ్వెరపోయారు!- ఏం చేస్తున్నాడంటే? సిగ్గు సిగ్గు. తన చెప్పు తానే చేతికి తీసుకొని కొట్టుకొంటున్నాడు. 'ఎందుకయ్యా?' అని అడిగితే - ఆ గుర్రప్పందాల మొనగాడు. "నోరున్న మనిషిని. నోరులేని జంతువుల పైన ఆడి ఓడితినే!" అని బోరోమని ఏడ్చాడు.

జాలిపడటానికి బదులుగా అందరూ నవ్వుకొన్నారు.

అయితే ఈ ఏడుపు ఆ ఏడుపుగాదే? అని తెపురుకొని తేరపారచూస్తే కనుచూపును మించుతున్నాడు. గనిమలమీద పడ్తూ లేస్తూ పోతూనే ఉన్నాడు.

పొట్టకర్ర కొచ్చిన నా ఆశ్యర్యం వెన్నుపోయింది.

కాలికి బుద్ధి చెప్పక తప్పలేదు!

రెండు పరుగుల దూరంలో కాన బావి. కన్ను మూసి తెరిచేలోపుగా ఆ ఆకారం బావి గట్టున నిలబడింది.

కనుచూపు దూరంలో నిలబడ్డాను నేను. అటు ఇటు చూశాను. కాన బావి ప్రక్కన్నే ఓ పెద్ద మట్టిగడ్డ. ఎప్పుడో ఆ బావి త్రవ్వినప్పుడు ఆ మట్టిని తీసిపోస్తే అది కానబావి గడ్డగా నిలబడింది. ఆ గడ్డమీద ఒక పెద్ద వేపచెట్టు. ఒక్క ఊపులో వెళ్లి ఆ చెట్లు చాటులో నిలబడ్డాను- చూపును మాత్రం ఆ ఆకారం మీద నిలిపి.

ఆ ఆకారం గబాలున బోర్లగిల పడింది. రెండు చేతులతో పొదివి పట్టుకొనింది. తల వాలేసింది. వలవలా ఏడుస్తూ ఉంది.

చీకటి బాగా పలచబడింది. ఆ ఆకారం ఏడుపు కొనసాగుతూనే ఉంది. గబగబ గడ్డమీది నుండి కిందికి దిగాను. కౌగిలి తన్మయత్వంతో కన్నీటితో అభిషేకం చేస్తున్న ఆ ఆకారం నన్ను గమనించే స్థితిలో లేదు.

పిల్లి అడుగులతో వెళ్ల గలిగినంత దగ్గరికి వెళ్లాను!-

వెన్నుపోయిన ఆశ్చర్యం పండి రాలింది!-

ఆ ఆకారం కౌగలించుకొని వలవలా ఏడుస్తున్నది- వదిలిపెట్టి వెళ్లిపోతున్న ప్రియురాలిని కాదు. ఆ చీకట్లో తనకోసం ఎదురుచూస్తూ ఉండిన ప్రేయసినీ కాదు!

అయితే ఇంకెవర్ని?

ఆ బావి గట్టు మీద బిగించిన కరెంటు మోటర్ని!

ఒక బావి దగ్గర ఎగిరి ఒక్క తన్ను తన్నాడు. అక్కడికి తృప్తి పడకుండా కారి ఉమ్మాడు. మరొక బావి దగ్గర ఎడమకాలి చెప్పుని కుడిచేతికి తీసుకొని ఎంచి ఏడేట్లు కొట్టాడు!

ఇంతకూ అలా చేసింది ఎవరు?

మాదిగ రాముడు!

ఎందుకు చేశాడు?

అదే అంతుచిక్కడం లేదు.

వాడి ఏడుపు కొనసాగుతూనే ఉంది. ఆ సమయంలో వాడి కంట్లో పడటం ఇష్టంలేకుండా గబగబా గడ్డ మీది కెక్కాను. వేపచెట్టు చాటులో నిలబడ్డాను.

రాముడు ఓపిక ఉన్నంతసేపు ఆ కరెంటు మోటర్ని కౌగలించుకొని ఏడ్చాడు. తరువాత పైకి లేచాడు. భుజం మీది తుండుగుడ్డతో కండ్లు వత్తు కొన్నాడు. రెండడుగులు ముందుకు వేశాడు. నిలబడి కరెంటు మోటరును జాలిగా ఒక్క చూపు చూశాడు. గిరుక్కున వెనక్కు

తిరిగాడు. గబగబ నడుస్తున్నాడు మాదిగిండ్లవైపు!-

భూమి నిద్రపోతూ ఉంది. చీకటిలో మునిగిన నల్లని పొలాలు ప్రశాంతతలో మెల్లగా కరిగిపోతున్నట్లున్నాయి. నాలో మాత్రం ఒక విధమైన అశాంతి. ఆలోచనలు రాముడి చుట్టూ.... చూపులు మింటి తట్టు!-

చీకటి రక్కసి కురులు విరబోస్తే ఆమె తలలోని పువ్వులు చెదిరి అక్కడొకటి అక్కడొకటిగా ఆ వెంట్రుకల్లో తగులుకొన్నట్లు మినుక్కు మినుక్కు మంటున్నాయి మింటి మీది చుక్కలు - నా ఆలోచనలతో పోటీ పడ్తూ.

మెల్లగా కానబావి గడ్డమీద నుండి కిందికి దిగాను. నాకు తెలియకనే నా చూపు బావి గట్టుమీద కరెంటు మోటారు మీద పడింది. పెదవుల మీద ఒక అస్పష్టమైన చిరునవ్వు వెలిసినట్లు వెలిసి చీకటిలో కలిసిపోయింది!

మా బావి దగ్గరికి నడుస్తున్నాను - రెట్లావు గనిమల మీద అడుగు మీద అడుగ్గా - అతి జాగ్రత్తగా. మనస్సు మాత్రం అంతకంటే జాగ్రత్తగా నన్ను చేయి పట్టి నడిపించుకొని రెండు దశాబ్దాల వెనక్కు వెళ్లిపోయింది. రాముడి ముందు నిలబడింది.

రాముడు!-

నిడుపాటి చెవుల్లో నిగ నిగలాడే ఎర్రాళ్ల అంటుజోళ్లు... దట్టమైన కనుబొమల కింద వెడల్పయిన కండ్లు...ఆ కాటుక కండ్లల్లో ఎప్పుడూ తొణికిసలాడే చిలిపితనం...గుబురు మీసాలు...ఆడవాళ్లే అసూయపడేటట్టుగా పిడికిట్లో ఇమడని సిగముడి...నడకలో అందాలు పోయే హుందాతనం - చూస్తుంటే 'వీడెలా తక్కువ కులంలో పుట్టాడా?' అన్న సందేహం ఎవడికైనా తప్పక కలుగుతుంది.

అలాంటి రాముడికి కొంపదీసి పిచ్చి పట్టలేదు గదా?-

కాలు తడబడింది. ఆలోచన తెగింది. పైరుగాలి సయ్యాటలాడుతున్నా నాలో చిరుచెమటలు!-

నిజంగా ఇది నా జీవితంలో ఊహించని అనుభవం కదా మరి? ఎక్కడో ఉద్యోగం చేసుకొంటున్న నేను ఎదురు చూడడం కాదు- అసలు ఊహించలేని సంఘటన! ఉద్యోగ బాధ్యతలు...పిల్లల చదువులు... ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ మూడు నాలుగేండ్లకో కానీ ఒకసారి మా పల్లెకు రావటానికి వీలుపడేది కాదు. అప్పుడు కూడా ఇల్లాలి మూతి విరుపులు... ముక్కు చీదడాలు తప్పేవి కావు.

నేను వచ్చి నాలుగు రోజులయింది.

ఆరోజు సాయంత్రం మా అయ్య-

"ఒరే అబ్బోడా! ఈ కరంటు రానన్నా వచ్చింది. దినమ్మా జాగారమై పొయ్యిందిరా బతుకు. ఎప్పుడొస్తిందో? ఎప్పుడు పోతిందో! దాన్ని ఇడ్సిపెట్టే వోడికి కూడా తెలిసి ఏడ్సేటట్టుగా లేదు. ఈపూట మడికట్టా తడేసి రాపోరా!" అన్నాడు పాపం! పాలుమాలి.

ఆయన అన్న మాటలో ఆవగింజంత అపద్ధం లేదు.



3.

నా చిన్నతనంలో మా అయ్య సేద్యం ఒక పద్ధతికి కట్టుబడి కొనసాగింది. కోడికూతతో నిద్రలేస్తాడు. బావిలో మోట కట్టుకుంటాడు. అవుల వేళ వరకు మోటతోల్తాడు. ఆ బావికింద మడికి తడి పడుతుంది. అప్పుడు మోట విడిపించి గొడ్లను గాటగట్టి అంత మేపువేసి మళ్లీ మడి కాడికి పోతాడు. రైతు వొళ్లొంచి పని చేయాలే కానీ- ఎప్పుడూ చేతి నిండికి పని ఉండనే ఉంటుంది. మధ్యాహ్నం వచ్చి అంత ఎంగిలి పడతాడు. కాసేపు అలా నడుం వాలుస్తాడు. నాలుగైదు బార్ల పొద్దు ఉన్నప్పుడు ఏ కయ్యలోనో మడక కట్టతాడు. కన్జీగిటి పడుతున్న వేళలో మడక విడిపిస్తే-మళ్లీ ఏవో చిల్లర మల్లర పనులు. జామురాత్రిలో పడకేస్తే మళ్లీ కోడికూత నిద్రలేపుతుంది!

ఇప్పటి పరిస్థితి దీనికి పూర్తిగా భిన్నం. మనిషి సాధించిన శాస్త్ర పరిజ్ఞానంతో మోట కట్టే పని లేదు. మడక పిడి పట్టే అవసరం లేదు. కరెంటు మీద ఆధారపడిన సేద్యం. ఆ కరెంటు ఎప్పుడు వస్తుందో తెలియని కారణంగా బావిగట్టున శవజాగరణం.!-

మనిషి ఓర్పుకు పరీక్ష పెట్టే విషమ స్థితి. అయినా తప్పించుకోలేని పరిస్థితి. ఆ పరిస్థితి నుండి ఒక్కటంటే ఒక్క దినం విముక్తి పొందాలను కొన్నాడు మాఅయ్య- ఆ బాధ్యత నాకు అప్పగించి!

అదే ఆలోచిస్తూ గనిమల మీద మెల్లగా నడుస్తున్నాను. అంతలోనే మా బావి పంపుసెట్టు దగ్గర కరెంటు దీపం వెలిగింది. అసలు నేను వచ్చిన పని ప్రక్కన బెట్టి దోవ జగడం ఇంటిదాకా అనుకొన్నట్లయిందే పరిస్థితి అని అనుకొంటూ పడ్తూ లేస్తూ బావిదగ్గరకి చేరుకొన్నాను. మీట నొక్కాను. బావిలో నీళ్లు ఉరుకుల పరుగుల మీద పంపుగండా వచ్చి కాలువలో పడి వయ్యారాలు పోతూ సాగిపోతూ ఉన్నాయి. మడవ తిప్పి మడికి నీళ్లు పెట్టాను. ఆ కయ్య పారే దాకా చేయవలసిన పనేమీ ఉండదు.

బావిగట్టున చతికిల పడ్డాను-అనవసరంగా కొని తెచ్చుకొన్న అలసటతో!- అలసిన శరీరానికి నిద్ర ఆహారం. కండ్ల మీద నిద్ర తెరలు వాలుతున్నాయి. కానీ కరెంటు మోటారుకు కావలికాస్తున్నాను కదా?- ఆ మోటారును తదేకంగా చూస్తూ ఉంటే-మళ్లీ ఆలోచనలు రాముడి మీద ముసురుకొన్నాయి!-

ఆ నాలుగు పల్లెల్లో ఒక వంద గడపకు పైగా ఉంది. అందులో మూడుం ముప్పాతిక అంతో ఇంతో సేద్యం చేసుకొని బతికే వాళ్లే. వీళ్లందరికీ రాముడు లేకుంటే దినగండం నూరేండ్లాయుస్సు!

రాయలసీమలో నదీనదాలు లేవు. రాష్ట్రంలో ఉండే పెద్ద పెద్ద నదులకు కట్టిన ఆనకట్టల నుండి నీళ్లు తరలించే ఆలోచన అసలేలేదు. అందువల్ల రాయలసీమ సేద్యం బావుల మీద ఆధారపడింది.

తొలికోడి కూసే వేళకాడ మోటగట్టి నాలుగుబార్ల పొద్దెక్కేదాకా 'రామన్నరామో!' అని మోట తోలితేనే మడికి తడిపడుతుంది. మోటకు చర్మంతో కుట్టిన బాన అవసరం. ఆ బానను తయారు చేసి దాని జీవితకాలమంతా వచ్చిందీ పొయ్యిందీ సరిచేసే బాధ్యతల్ని చేపట్టడం

రాముడి పని. అందుకే ఆ నాలుగు గ్రామాల క్రింద సేద్యం రాముడి సహకారంతో సాగుతుంది.

"రాముడూ! తొండం అడ్డానికి చినిగి పొయ్యిందిరా! మడికి తడిపడి రొండునాళ్లయ్యింది. ఈ పొద్దన్నా తడిపడితిందనుకొని తొలికోడి కూసే యాళకాడ నిద్దర లేస్తే రాళ్ల కాలవ కాడనే తెల్లారినట్లయింది బతుకు. నీకు పున్నెముంటింది. లెయ్‌రా!" అని ఒక సన్నపాటి రైతు ఇంటి ముందు నిలబడి బతిమాలుతూంటే-

"ఒరే రాముడూ! నిన్నగాక మొన్న కుట్టిస్తివి గదరా!- అంతలోకే తొండం దారి తొండానిది. బాన దారి బానదయింది. లేచిరారా! ఈపొద్దనంగానే తిరుగుడు కపిల కట్టిస్తి. ఇద్దరు మణుసులు. రొండు కాండ్ల ఎద్దులు. అపర దండగైపాయ గదరా?" అని ఒక కలిగిన రైతు ఎలుగెత్తి బావి దగ్గర నుండే అరుస్తూ ఉంటే-

"రామన్నా! రామన్నా!!- ఈపొద్దు బాయిలో వంతుగానా పొయ్యిందంటే మళ్లా మూణ్ణాళ్లకు. ఇప్పిటికే పైరు వరటక పోతా ఉండాది. రొండే రొండు కుట్లు...అట్టా ఏసేసి పోరాదా?" అని ఇంకొకరైతు అడుక్కుంటూ ఉంటే-

"ఇంతమంది ఇంటి చుట్టూ చేరి అరస్తా ఉంటే చెవల్లో చెట్లేమన్నా మొలిసినాయా? మొగోడికింత పాలుమాలిక పనికిరాదే? 'పాలుమార్తివా బయిశార్తివా!' అంటారు పెద్దోళ్లు. లెయ్యే! లెయ్!" అంటూ రాముడి పెండ్లాం లచ్చిమి పోరు పెడుతూ ఉంటే-

"దినమ్మా చచ్చేవాడికి ఏడ్సేవాళ్లెవురొసే!- చాల్సాలుగానీ ఉండే?" అని కసురుకొంటూ లేచిపోతున్న పెండ్లాన్ని ఒక చేత్తో పొదివి పట్టుకొని మలికోడి కూసేవేళకాడ నులక మంచం మీద వొత్తిగిలి పడుకునే రాముడు- తొలికోడి కూతకు ముందే - కరెంటు మోటార్లతో కలబడడం!- ఎంత ఆలోచించినా సమాధానం దొరకలేదు.

అంతలో నీళ్లు పారుతున్న మడికయ్య మనసులో మెదలడంతో ఆలోచన తెగిపోయింది. పైకి లేచాను. కయ్య నాలుగు ప్రక్కలా తిరిగి చూశాను. కయ్య కలగలిసింది. మడవ తిప్పి మరొక కయ్యకు నీళ్లు మళ్లించాను!- బావిగట్టున కూర్చున్నాను. కరంటు మోటరు రొద చేసుకుంటూ తిరుగుతూ ఉంది. దాంతో పోటీ పడుతూ నా ఆలోచనలు!-

ఇంటి ముందు నిలబడి రైతులు రంపు చేస్తుంటే...పెండ్లాం లేచి పోరాదా? అని కసురుకొంటూ ఉంటే రాముడు బద్ధకంగా నిద్ర లేస్తాడు. పళ్లు తోముకుంటాడు. ముంతడు నీళ్లతో మూతి కడుక్కుంటాడు. తోలుసంచిని భుజాన తగిలించుకొని బయలుదేరతాడు!-

తన వృత్తి ఎంతో మందికి సహకరిస్తున్నదన్న సంతోషమో? లేదు- తాను రైతుల ఇండ్లల్లో అడుగుపెట్టలేక పోయినా- తన ఇంటి ముందు ఇంత మంది రైతుల్ని నిలబెట్టుతున్నానన్న ధీమానో- రాముడు నడుస్తూ ఉంటే ఒక రాజు తన రాజ్యంలో పర్యటనకు బయలుదేరిన రాచఠీవి సిగ్గుపడుతుంది. ఆ రాజు వెంట నడుస్తున్న అంగరక్షకుల్లా రాముడి వెంట ముగ్గురు నలుగురు రైతులు!

ఆ నాలుగు పల్లెల క్రింద ఉన్న నలభై బావుల దగ్గరికి విధిగా వెళ్లతాడు రాముడు. ఒక

బావి దగ్గర అడ్డానికి చినిగిన తొండానికి కుట్లు వేస్తాడు. మరొక బావి దగ్గర చిల్లులు పడ్డ బానకు మాసికలేసి సరి చేస్తాడు. ఇంకొక బావి దగ్గర తొండానికి 'ఉంగటాలు' తెగిపోతే కుడతాడు. అంతలో ఇంకొక బావి దగ్గర నుండి పిలుపు వస్తే అక్కడికి పోతాడు. ఇలా మిట్ట మధ్యాహ్నం వరకు ఈ బావి దగ్గర నుండి ఆ బావి దగ్గరికి, ఆ బావి దగ్గర నుండి ఈ బావి దగ్గరికి, నిలబడిన చోట నిలబడకుండా తిరుగుతూనే ఉంటాడు- విసుగు నసుగు ఎరగకుండా!-

సద్ది వేళకు ఎక్కడో ఒక బావి దగ్గర ఎవరో ఒకరు ఆప్యాయంగా ఒక పచ్చి మిరపకాయ చేతికిచ్చి అంత సద్దిపోస్తే తాగుతాడు. ఇంకొక బావి దగ్గర ఆకు వక్క ఇస్తే నములుతాడు. పొద్దు నడిమిట్టకొస్తుంది. రైతులకు అదొక కొండ గుర్తు. మోట నిలిపేస్తారు. ఆ పూటకు రాముడు బాధ్యత నుండి బయట పడినట్లే లెక్క... అప్పుడు ఇంటి బాధ్యత గుర్తుకొస్తుంది. లచ్చిమి సంకటి కెలికిపెట్టి ఎదురు చూస్తూ ఉంటుంది. ఆ సంకటికి అనుపానం?- ఒక బావి కింద వంగతోటలో కాసిన్ని వంకాయలు... ఇంకొక బావికింద మిరపతోటలో దోసెడు పచ్చి మిరపకాయలు రాముడి నోట్లో మాట నోట్లో ఉండగానే చేతికొస్తాయి. రాముడు ఇంటి ముఖం పడతాడు!-

నాకు బాగా జ్ఞాపకం ఉంది- ఆ వేళప్పుడు రాముడి కోసరం ఎదురు చూస్తూ వాడి గుడిసె ముందు నిలబడి నేను!-

ఒక భుజాన సంచి. ఇంకొక భుజాన మూట. వయ్యారాలు పోతూ ఉంటే దర్జాగా నడుస్తూ రాముడు కంటపడితే-నిజంగా దేవుడే వస్తున్నంత ఆనందం. రాముడు వస్తాడు. నన్ను చూస్తూ నిలబడతాడు. గుబురు మీసాలను చీల్చుకొని వస్తున్న చిరునవ్వు చెవుల్లో మిలమిలా మెరుస్తున్న అంటుజోళ్లతో పోటీ పడుతూ ఉంటుంది.

"ఏం మిద్దింటి సినబ్బ శానా దూరం వచ్చేసినాడే?" అంటాడు.

"ఊరికే నన్నిట్టా ఉడకాడించబాక. జత చెప్పులు కుట్టియ్యమని నేను అడగతానే ఉండా. నువ్వు ఇద్దో అద్దో అంటానే ఉండావ్!"

"మిద్దింటోళ్ల సినబ్బ నోరు తెర్సి అడగాల్నేగానీ తూబెహ!- జత చెప్పులేంది సినబ్బా? ఈ సమ్మత్సరం మన బెల్లం అరగొండ బెల్లం అబ్బ మాదిర దిగింది గదా?... రొండే రొండు ముద్దల బెల్లం...తెల్లారేకాడికి తెచ్చెయ్. సందేళ కాడ చెప్పులు తొడుక్కోని తిరిగ చూడకుండా పోతా ఉండు!"

బెల్లం మాట చెవుల్లో పడేసరికి గుండెల్లో రాయి పడింది! అయినా కాదని చెప్పలేక సరే! అనలేక మనకరిస్తా ఉంటే-

"చెప్పు సినబ్బా!...సద్దేళకాడ ఎవురో పోసిన రొండు దోసిళ్లు సద్ది నీళ్లు. పాయ్ కడుపుకంత కొట్టుకోవాల్నా పన్లేదా? మీకేం మారాజులు. వండి పెట్టిన కూడు..."

"సరే రామన్నా!... నా తిప్పలు ఎట్నో నేను పడతా. బెల్లం తెచ్చిచ్చేవంతు నాది. రేపు సందేళకు చెప్పులు కుట్టిచ్చే బాద్దెత నీది. మాట తప్పినావో..."

"రాముడు ఎప్పుడన్నా ఎక్కడన్నా మాట తప్పుతాడా? నువ్వు పద సినబ్బా!" అంటూ రాముడు గుడిసింట్లోకి వెళ్లాడు. నేను ఇంటికి బయలుదేరాను.

కొత్త చెప్పులమీద ఆశ పెద్దయ్యోర్లు పరీక్షల్లో వేసే ప్రశ్న మాదిర భయపెడ్తూ బెల్లం చుట్టూ తిరుగుతూ ఉంది. మా ఇంట్లో బెల్లానికేం కొదవలేదు. నడవలో మూడు బొట్టలు. ఆ బొట్టల నిండికి బెల్లమే. మంచి ధర పలికితే బయట్కి పడాలని బొట్లల్లో మెత్తులకింద మూలుగుతా ఉంది. జొనెదెత్తు వరి కసువు పరిచి దాని మీద పేడతో అలికి మెత్తాశారే?- ఆ మెత్తుల్ని విప్పదీసేదంటే మాటలా?-

అదే ఆలోచిస్తూ నడుస్తున్నాను. కొత్త చెప్పులు ...బెల్లం- ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయి. అప్పుడు ఉన్నట్లుండి గుర్తుకొచ్చింది. ఇంటి వాడుకలకని కడవల్లో పెట్టి దొంతుల్లో దాచి పెట్టిన బెల్లం. ఆ బెల్లంలో రెండు ముద్దలు... నా చేతికొచ్చి... తెల్లారేకాడికి రాముడి చేతికిచ్చి...కొత్త చెప్పులు తొడుక్కోని నడుస్తున్నంత హుషారు!-

ఇక ఆ రాత్రి నా తిప్పలు కుక్కలకే ఎరుక. బెల్లం ఏ కడవలో ఉందో? ఆకడవ ఏదొంతిలో ఉందో?... కనుక్కోవాలి. ఇంట్లో అందరూ మంచి నిద్రలో ఉండేటప్పుడు నా పని చక్కచేసుకోవాలి.

నేను ఎదురు చూసిన వాతావరణం ఇంట్లో ఏర్పడిందన్న నమ్మకం కలిగింది. మెల్లగా తలుపు తీసి అరలో అడుగు పెట్టాను. కన్ను పొడుచుకున్నా కనిపించని చీకటి. ఒక్కొక్క దొంతిలో ఒక్కొక్క కడవ మూతి దగ్గర మూతి పెట్టి వాసన చూశాను. ఒక కడవ దగ్గర మిరపకాయల ఘాటు. ఒక కడవ దగ్గర చింతపండు వాసన. ఒక కడప దగ్గర ధనియాల వాసన!... అలా వాసన చూస్తూ పోతూ ఉంటే ఒక కడవ దగ్గర బెల్లం వాసన తగిలింది!-

నల్ల పలకపై తెల్ల గీతలా ఆ చీకటిలో చిరునవ్వు!- అంతలోనే గుండె గభీమనింది. ఈడ్చి కొలిస్తే ఆ కడవ ఎత్తు ఉండను. అయినా కొత్త చెప్పుల మీద మోజు. 'సాహసం చేయరా ఢింబకా' అని పురికొలిపింది. ఒక్కొక్క కడవగా దించిపెట్టి బెల్లం కడవలో రెండు ముద్దల బెల్లం తీసుకొనేసరికి తలప్రాణం తోకకొచ్చింది. 'బ్రతుకు జీవుడా!' అనుకొన్నాను. దొంతిని యథా ప్రకారం పెట్టాను. రెండు ముద్దల బెల్లాన్ని విడివిడిగా కాగితాల్లో చుట్టాను. అడుగుమీద అడుగ్గా బయటపడి ఇంటి వెనక్కు పరిగెత్తాను. దట్టంగా పెరిగిన జిల్లేడు చెట్లు. ఆ చెట్ల చాటులో పెట్టాను. వచ్చి పడుకున్నాను. నిద్ర పట్టదే?- బెల్లం వాసనపట్టి ఏ కుక్కైనా వచ్చి నోట కరుచుకొని పోతే?-

నిమిషం ఒక యుగంగా కంటి మీద రెప్ప పడకుండా ఆ రాత్రి గడిచింది.

చీకటి పల్చబడుతూ ఉంది. ఎవరి పనుల్లో వాళ్లున్నారు. నా పనిలో నేను. ఇంటి వెనక్కు పరిగెత్తాను. బెల్లం పెట్టినచోట పెట్టినట్లే ఉంది. రెండు ముద్దలు రెండు చేతులలో పట్టుకొన్నాను. సంజీవి పర్వతాన్ని అరచేతిలో తెచ్చిన ఆంజనేయుడిలా, ఒక్క లగువులో మాదిగిండ్లను చేరుకొన్నాను!

ఆనందాన్ని పట్టలేక 'రాముడూ!' అని అరిచాను.

'రాముడు వస్తాడు. బెల్లం తీసుకుంటాడు. అప్పుడు వాడి ముఖం చూస్తూ రాత్రి పడిన శ్రమంతా మరిచిపోవాలి!' అని అనుకొంటూ వాడి కోసం ఎదురు చూస్తున్నాను.

అయితే పిలిచిన ఆరేడు నిమిషాలకు నిక్కతా నీలగతా వచ్చి ఆవులిస్తూ బెల్లం అందుకుంటూ వాడు చూసిన చూపు? నాకైతే పండ్లు తోమకుండా పచ్చి చింతకాయ కొరికినట్లయింది!- పసిగట్టినట్లుంది రాముడు.

"అదిగాదు సినబ్బా! నిన్ననే నీతో చెప్తామనుకుణ్ణా. నా మతి మండి పోను. నీకు కుట్టిస్తా ఉండానే కొత్త చెప్పులు!- వాటితో కొట్టుకున్నా తప్పులేదనిపిస్తా ఉండాది. మా ఇంట్లోది కడుపుతో ఉండాది. నీ సాచ్చిగా చెప్తా ఉండా. కొంపలో కలికానికంత చింతపొండు లేదు. ఈ బెల్లం తెచ్చే దానికి ఎన్ని తిప్పలు పణ్ణావో ఏమో పాపం!- నిన్ను కష్టపెడ్తా ఉండా. ఏమనుకోబాక. ఒక్క ఈసె చింతపొండు..."'

కొత్త చెర్మాన్ని పాలిష్ చేసినట్లుగా నా కోరికను మాలిష్ చేశాడు రాముడు.

చింతపండు మాటతో నాకు కొత్త చెప్పులమీద చింత వదిలిపోయింది.

మాకు చింతతోపు ఉంది. మా అమ్మకు మారు బేరాలు చేసే మగతనం ఉంది. అందుకే ఇంట్లో పంచలమీద వాకిట్లో ఎక్కడ చూసినా చింతపండే!-

ఒక్క వీసే చింతపండు రాముడికి చేర్చడం చిటికెలో పని!-

అదికూడా అయిందనిపిస్తే- "సినబ్బా!...సినబ్బా!...మన అమ్మ పేరు ఎరగడ్డలామె కదా?" 'అంటూ నా చెప్పులకు వాడుతున్న చర్మాన్ని... దాని అందాన్ని...మన్నికను మాట పొల్లుపోకుండా వివరిస్తూ ఎర్రగడ్డలు తెమ్మనేవాడు.

నిజంగా ఒక్క జత చెప్పుల కోసరం వాడు పెట్టిన తిప్పలు తల్చుకొంటూ ఉంటే-ఆ గనిమల మీద పడీ పడీ నవ్వాలనిపించింది. అది వాడి వృత్తి. ఒక వరప్రసాదంగా హాయిగా బ్రతకటానికి గొప్ప లౌక్యాన్ని నేర్పింది!

జ్ఞాపకం కండ్లలో నీటిచుక్కలా తళుక్కుమనింది.

నా ఆలోచనలతో పోటీ పడుతూ మోటరు తిరుగుతూనే ఉంది. బావిలో నీళ్లు ఎడతెరపి లేకుండా వచ్చి కాలువలో పడుతున్నాయి. వయ్యారాలు పోతూ కాలువలోసాగి మడిలో చేరుతున్నాయి. మడి పారిందో?లేదో?- ఎగిరిపడి లేచాను. కయ్య నాలుగు గనిమల మీద తిరిగి చూశాను. కయ్య కలగలుస్తూ ఉంది.

అక్కడే నిలబడి మడి కయ్యని తేరిపార చూశాను.

మా అయ్య చెమట ప్రకటించిన పచ్చదనం. పొట్టకర్ర కొస్తూ ఉంది. ఇంకొక్క నెలా పది రోజుల్లో పండుతుంది. నిలబడలేని నిండు గర్భవతిలా నేలకు వాలుతుంది. పచ్చదనం బంగారు రంగుకు మారుతుంది. అప్పుడు కోత. వరికోత అంటే అదొక చిన్న తిరణాల. కోత కోసేవాళ్లు కోస్తూ ఉంటే...తాలు వాదెలు వాదెలుగా మోసేవాళ్లు మోస్తూ ఉంటే...కళ్లంలో 'పొలో పొలి' అని తాలు కొట్టేవాళ్లు కొట్టూ ఉంటే...గనిమల మధ్య ఏపుగా పెరిగిన పచ్చి కసువును ఆవులూ...గేదెలూ...ఎద్దులూ ఆవురావురమని మేస్తూ ఉంటే- అప్పుడు చూడాలి

రాముణ్ణీ వాడి పెండ్లాన్ని! రాముడూ వాడి పెండ్లామే కాదు. కుమ్మరి కమ్మరి మేర కోసం వస్తారు. వాళ్లు ఏడాది పొడుగునా రైతులకు అందించిన సేవలకు ప్రతిఫలం మేర. దానికి కొలత లేదు. తూనిక అసలే ఉండదు. కయ్యల మీద పడి వరితాలు వాళ్లు మోయగలిగినంత మోపులు కట్టి మోసుకొని పోవచ్చు. అవకాశం ఆశ ఒకదానితో ఒకటి పోటీ పడ్తే వాళ్లు కయ్యల్లో కళ్లెల్లేని గుర్రాలే!- నెత్తి మోతకు మించినట్లుగా మోపులు గట్టి నెత్తికెత్తుకొని మోయలేక నడ్డి నీలుగుతూ ఉంటే చూస్తూ రైతులు ఆనందంతో ఊగిపోయే వాళ్లు!

నా పని మడికి తడి వెయ్యడం. అయితే నేను ఆలోచిస్తున్నది రాముడిని గురించి మనిషి బాహ్యంగా ఏదో ఒక పనికి పరిమితమైనా దాన్ని కాదని మనసు ఏదేదో ఆలోచిస్తూ ఉంటుంది. అయితే అసలు పనిమీద ఒక కన్ను ఉండనే ఉంటుంది. అది మనిషి స్వభావం!-

కయ్య కలగలిసిందో లేదో వంగి చూశాను పాదం మునివేళ్లతో తడిమి. సందేహం తీర్చుకొన్నాను. కలగలిసింది. మోటరు ఆపుచేద్దామని బయలుదేరాను. నాలుగడుగులు వేశానో లేదో 'టపీ' మని ఆగిపోయింది.

"అది ఎప్పుడొస్తిందో?...ఎప్పుడు పోతిందో?- దాన్ని యిడ్సిపెట్టే వాడిగ్గూడా తెల్సి ఏడ్సినట్టు లేదు." అన్న మా అయ్య మాటలు మనసులో మెదిలి నవ్వుకొంటూ బావి గట్టుకు నడిచాను. దేనికైనా మంచిదని మళ్లీ ఒకసారి ఎర్ర మీట నొక్కాను. ఇంటిముఖం పట్టాను.

తూర్పున పటం ఎగురుతూ ఉంది!-

"మేలుకొన్న వాడే సూర్యోదయ సూర్యాస్తమయ శోభను తనివి తీరా ఆస్వాదించ గలడు" అని ఎవరో అన్న మాట గుర్తుకు వచ్చి తూర్పు దిక్కును చూస్తూ నిలబడ్డాను.

చీకటి యాత్రకు చివరి అంచు. రంగురంగుల కోరికలతో కూడుకొన్న మనసుకు ప్రతీక. ప్రకృతి పురుషుడు పనిగట్టుకొని చిత్రించిన తైలవర్ణ చిత్రం. ఎంతో మనోహరంగా ఉంది!

పిల్ల తెమ్మెరల తాకిడితో మెల్లగా తలలూపుతూ పైరుపచ్చలు కూడా స్వాగతం పలుకుతున్నాయి వెలుగుకు!

మనసుకు గొప్ప ఊరట కలిగిన అనుభూతి!

అయితే అప్పటికే చుట్టప్రక్కల కయ్యల్లో మడకలు కట్టి దున్నుతున్న రైతులు ఎద్దుల్ని అదిలిస్తున్న అరుపులతో నా ఏకాగ్రత చెదిరి పోయింది. పట్టణాల్లో డబ్బులు పెట్టినా కొనలేని అనుభూతి. భారంగా ఒక నిట్టూర్పు. అంతకంటే భారంగా అడుగు ముందుకు పడింది!-

నన్ను చూసి ఎగతాళి పడుతున్నట్లుగా ఊరి ముందర మా చింతతోపులో కాకుల రంపు!- ఆ రంపులో దూరి ఇంట్లో పడ్డాను!-

రాత్రి బొత్తిగా నిద్రలేకపోవడం...రెట్లావు గనిమల మీద పడుతూ లేస్తూ రాముడి వెంట పడడం..వాహన సుఖం మరిగిన శరీరం- బాగా అలిసిపోయింది. అలా పడుకొన్నానో లేదో బాగా నిద్రపట్టింది!

"ఒకే ఒక రాత్రి. అట్ట పొయ్ మడికి తడేసిరారా అబ్బోడా అంటి రోంత పాలుమాలి. అట్టచూడు నీముద్దుల కొడుకును. బారెడు పొద్దెక్కినా ఇంకా ఎట్టా గురక పెట్టా ఉండాడో? అదే నేనయ్యుంటే ఊరికే ఇడ్సిపెట్టే దానివేనా? ... కుండను గోకినట్టు గోకేదానివే?"

ఎక్కడో లీలగా వినిపించీ వినిపించనట్లున్న మాటలు.

ఉలిక్కిపడ్డాను!

"నువ్వు చెప్పే కత బలే బాగుండాదే?- గుర్రాన్ని గాడ్దిని ఒకే గాట్లో కట్టేస్తే ఎట్నే?నీకంటే అలవాటైపొయ్యింది. గురుగు పువ్వు మాదిర్తో పెరిగిన బిడ్డ. ఆడికీ గొప్పే!- నీమాట కాదనలేదు. రేత్రంతా కంటిమీద రెప్పట్టా పడి ఉండదే? కొంచింసేపు అట్టా పొణుకోని నిద్దర పోనీలే. ఇప్పుడు నీయబ్బ గంటు ఏం పోతా ఉండాదిక్కడ?"

అదీ తల్లి ప్రేమ!-

అయినా నా నిద్ర అమ్మ అయ్యల మధ్య వాదులాటకు దారితీయడం ఇష్టంలేక లేచాను. పెరట్లో పొయ్యిమీద సలసలా కాగుతున్నాయి నీళ్లు. కాలకృత్యాలు తీర్చుకొని వేడినీళ్ల స్నానం. బడలికంతా దిగిపోయినట్లపించింది. సద్ది బువ్వ అలవాటు తప్పిందని గ్రహించిన తల్లి తెల్లారే సరికి చేతులు కాల్చుకొని అంత టిఫిన్ చేసి పెడ్తూ ఉంది. ఆరోజు ఉప్మా. వేడి వేడిగా పెట్టింది అమ్మ ప్రేమను అందులో కలిపి తిన్నాను!-

నేను ఊళ్లోకొచ్చి నాలుగైదు రోజులయింది కదా? ప్రతిరోజూ అనుకొంటూనే ఉన్నాను. ప్రక్క ఊళ్లో వున్న చిన్ననాటి మిత్రుడిని కలుసుకోవాలని. అనుకోవడం ఏవో పనుల్లో పడి అనుకోవడంగానే మిగిలింది. ఒకటి రెండు రోజుల్లో తిరుగు ప్రయాణం కట్టాలి. అందువల్ల ఆపూట తప్పనిసరిగా చిన్ననాటి మిత్రుడిని కలుసుకోవాలని బయలుదేరాను.

మా ఊరికీ ఆ ఊరికి మధ్యదూరం మూడు కిలోమీటర్లకు అటో ఇటోగా ఉండొచ్చు. ఇన్నాళ్లుగా ఈ రెండు ఊళ్లను కలుపుతూ ఉండింది కాలిబాట. అది ఇప్పుడు బాటగా మారుతూ ఉంది. ఫరవాలేదు ఈ పల్లెకొంపల మీద కూడా ప్రభుత్వ దృష్టి పడిందే?- అని ఆలోచిస్తూ నడుస్తున్నాను.

"ఎవురాడ పోతా ఉండేది?...మిద్దింటోళ్ల సినబ్బే గదా?"

అ మాట చెవిని పడడంతో ఒక్క క్షణం నిలబడి చుట్టుప్రక్కల చూశాను.

మాదిగ రాముడు!

ఒక్క అడుగులో వచ్చి నా ముందు నిలబడ్డాడు.

"ఏం సినబ్బా?...ఎప్పుడొచ్చింది?...అంతా బాగుండారా నాయినా?"

రాముడు అడుగుతున్నాడు. ఆమాట చెవుల్లో పడితే స్పందించి పలకాల్సింది నోరు. అయితే కనురెప్పల దోసిళ్ల వాడి ఆకారాన్ని ఆవురావురు మని తాగేస్తున్నాయి!

నెత్తి మీద మట్టి తట్ట...పుల్లదుమ్ము నిండిన వొళ్లు...కళావిహీనంగా ముఖం...బాగా సొట్టలు పడ్డ బుగ్గలు...దీగూట్లో మలిగిపోతున్న దివ్వెల్లా కండ్లు!...

నా పరిస్థితి రాముడికి అర్థమైంది.

"ఏం చెయ్యమంటారు చెప్పండి సామీ?...ఈ కరంటు రానన్నా వచ్చింది. మోటకట్టే నాదుడే లేకపాయ. ఈ బతుకిట్టా మట్టి పాలాయ. మా ఆడది గడపదాటింది నువ్వెప్పుడైనా చూసినావా చెప్పు సినబ్బా?...ఇప్పుడు చూడు. ఇంటిల్లిపాదీ సందేళదాకా ఈ మట్టిలో పొరకలాడ్తే అంత గెంజి దొరికేది గెగనమై పోతా ఉండాది. ఆ రోజులింక రాబొయ్యేది లేదు నాయినా!"

రాముడి గొంతు పూడుక పోయింది.

అప్పుడు అర్థమైంది నాకు - కరెంటు మోటర్ల మీద వాడి కసి!

రాముడి పెండ్లాం లచ్చిమి. పారతో మట్టిని తట్టల కెత్తుతూ ఉంది. గుడిసింటి గడపదాటని లచ్చిమి. నల్లరాతితో చెక్కిన శిల్పంలా పుష్టిగా ఉండేది. ఎలా ఉన్నది ఎలా అయిపోయింది. ఎక్కడిదక్కడ ఎండి పోయింది. మెడలో మిల మిలా మెరుస్తూ గజ్జలు...చెవుల్లో కమ్మలు మాటీలు..కాళ్లకు కడియాలు ఏమయ్యాయో?- పారతో ఎత్తలేక మట్టితట్టలకు ఎత్తి పోస్తూ ఉంది. పెండ్లికెదిగిన ఒక కుర్రవాడు గడ్డపారతో మట్టిని తవ్వుతున్నాడు. వాడికంటే ఒకటి రెండేండ్లు చిన్నదిగా ఉండొచ్చు. ఇంకొక అమ్మాయి రాముడితో కల్సి మట్టి మోస్తా ఉంది. బహుశా రాముడి బిడ్డలేమో?

సముదాయింపుగా నాలుగు మాటలు చెప్పాల్సిన అవసరం. అంతలోనే-

"ఎవుర్రా అక్కడ మీటింగ్ పెట్టింది?...మాదిగ రాముడేనా? నాకు తెల్సు. దోవన వస్తా పోతా ఉండే వాళ్లతో అంతా వాడికిదే పని!" పనికి ఆహార పథకంతో ఆ మట్టిబాటను వేయిస్తున్న కాంట్రాక్టర్ అరుస్తున్నాడు.

"చూడు సినబ్బా!...ఇదీ వరస. గెంటల తరబడి నిలబెట్టి మేటి రైతుల్నే నా ఇంటి ముందర. అవ్వి ఆదినాలు!...ఇప్పుడు ఒక్క నిమిశం నీతో మాట్లాడతా నిలబడ్తే కూలిచ్చే మొగలాయి ఎట్టా కసురుకుంటా ఉండాడో చూడు. ఇవ్వి ఈదినాలు!...నా కులవృత్తి ఎప్పుడు పాయనో నాబతుకే పాయ. పాపిష్టి బగమంతుడు ఈ కడుపాగటిచ్చి ఇన్ని యాతన్లు పెడ్తా ఉండాడు. ఏం చేస్తాం?...పద సినబ్బా!...పద!" అంటూ రాముడు తన పనిలో లీనమయ్యాడు.

"ఎవురక్కడ మీటింగ్ పెట్టింది?...మాదిగ రాముడేనా?" అన్న కాంట్రాక్టర్ మాట సూటిగా నా గుండెల్ని తాకింది. బరువుగా అడుగులు ముందుకు పడుతున్నాయి. ఆలోచనలు మాత్రం రాముడి చుట్టూ తిరుగుతున్నాయి.

మానవుడు ప్రగతి సాధనలో సాధించిన సాంకేతిక శాస్త్ర పరిజ్ఞానం కారణంగా రాముడి వృత్తి మారింది. అయినా రాముడు మాదిగ రాముడే!

ఒకప్పుడు జీవన సౌలభ్యం కోసరం వృత్తుల ఆవశ్యకత ఏర్పడింది. అది సాంఘికావసరం. ఆ వృత్తులతో కులాలు. కానీ మనిషి నాగరికుడయ్యే కొద్దీ వృత్తులు అడుగంటి పోతున్నాయి. వృత్తులతో ఏర్పడిన కులాలు మాత్రం స్థిరంగా నిలబడి మనుషులను వేరుచేస్తున్నాయి వరి పొలాలను వేరు చేస్తున్న సర్వే రాళ్ల లాగా! అవే నెంబ్రరాళ్లు!!

'ఇది నా పొలం!' 'అది నీ పొలం' అని హద్దులు నిర్ణయించే ఈ నెంబ్రరాళ్లు మనిషి స్వార్థాలకు ప్రతీకలు. కులాలూ అంతే! మరిచి పోదామంటే గుర్తుకొస్తూనే ఉంటాయి. తెంపేయాలనుకుంటే వేళ్లూనుతూనే ఉంటాయి!

వీటికి చరమగీతం పాడగలిగితే?

అప్పుడు నేను ఊరి ముందర పొలాల మధ్య నడుస్తున్నాను.

వాటిని వేరుచేస్తున్న నెంబ్రరాళ్లు నన్ను చూసి విరగబడి నవ్వుతున్నాయి ●

- *ఆంధ్రప్రభ (11-6-1980)*